సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 3 । అక్టోబర్ । 2023



ఓర్పుగా శిక్షణ..

బ్యూటీషియన్ కోర్సులకు డిమాండ్ పెరుగుతోంది. ఉచిత శిక్షణలు సద్వినియోగం చేసుకుంటున్నారు. - 8లో



ప్రవాహానికి అంతరాయం

నారాయణపురం ఆనకట్ట సాగునీటి ప్రవాహానికి అంతరాయం కలిగింది. సైఫన్ బావికి గండి పడింది. - 8లో

రెండో రోజూ స్పృశించని కిరణాలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి క్షేత్రంలో రెండోరోజూ కిరణ స్పర్శ దర్శనం సాక్షాత్కరించలేదు. ఆకాశం మేఘావృతం కావడంతో సోమవారం కూడా కిరణాలు మూలవిరాట్టును తాకలేదు. దీంతో సోమవారం ఉదయానికి చేరుకున్న భక్తులంతా నిరాశ చెందారు. అనంతరం విద్యుత్ కాంతుల మధ్య యథావిధిగా ఆదిత్యుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఉచిత ప్రసాదం అందేలా ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

న్యూస్‌రీల్

నేడు పాలిటెక్నిక్ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా మంగళవారం పాలిటెక్నిక్ కళాశాలల్లో మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. జిల్లా కన్వీనర్ పాయింట్ పరిధిలో ఐదు ప్రభుత్వ, ఐదు ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, శ్రీకాకుళం మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, టెక్కలి, ఆమదాలవలస, సీతంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. ప్రైవేట్ రంగంలో ఐతం, శ్రీ వెంకటేశ్వర, శ్రీ శివానీ, టీవీఆర్, నారాయణ కళాశాలలు ఉన్నాయి. ఉదయం 9 నుంచి 11 గంటల మధ్య విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. అనంతరం రిజర్వేషన్ రోస్టర్, 10వ తరగతి మార్కులు, పాలీసెట్ ర్యాంకు వంటి ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. కళాశాలల నోటీస్ బోర్డులో ఖాళీల వివరాలు విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. స్పాట్ అడ్మిషన్లకు ప్రభుత్వ రాయితీలు జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన వర్తించవని ప్రవేశాల కన్వీనర్, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గురుగుబెల్లి దామోదర్‌రావు తెలిపారు.

'టైర్లపై అవగాహన ఉండాలి'



డ్రైవర్లకు టైర్లపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేసే డ్రైవర్లకు బస్సు టైర్లపై కనీస అవగాహన ఉండాలని ఆర్టీసీ 2వ డిపో మేనేజర్ కెఆర్ఎస్ శర్మ అన్నారు. శ్రీకాకుళం 2వ డిపోలో టైరు సంరక్షణ పక్షోత్సవాల కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ గ్యారేజీ ఆవరణలో సిబ్బందిని సమావేశపరిచి, టైర్ల మన్నికకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వారంలో రెండుసార్లు టైర్లలో గాలి చెకింగ్ చేయాలని, ప్రతిరోజు టైర్లలో ఇరుక్కున్న రాళ్లు తొలగించాలని, డ్రైవర్లు సడన్ బ్రేకులు వేయకుండా వాహనాన్ని నడపాలని, టైరు పంక్చర్లను గమనించిన వెంటనే డ్రైవర్లు టైర్లను మార్చుకోవాలని, రోడ్డు కండిషన్ బట్టి బస్సులకు తగిన టైర్స్ వేసి నడపాలని పలు జాగ్రత్తలు చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్లు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ స్టేట్ డాక్టర్స్ వింగ్ కమిటీ నియామకం



రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉలాల శేషయాదవ్



జోనల్ ఇన్‌చార్జి పైడి మహేశ్వరరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర డాక్టర్ల విభాగ కమిటీలో జిల్లాకు చెందిన డాక్టర్ ఉలాల శేషయాదవ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, జోనల్ ఇన్‌చార్జ్‌గా (జోన్–1) డాక్టర్ పైడి మహేశ్వరరావుని నియమించారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి సోమవారం ఓ ప్రకటనలో విడుదల చేశారు.

పిల్లలతో ఉన్న యాచకులకు కౌన్సెలింగ్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని డేఅండ్ నైట్ కూడలి సమీపంలోని చంటిపాపలను ఎత్తుకుని యాచిస్తున్న ఇద్దరు తల్లులు, మరో ముగ్గురు మహిళలకు ఏహెచ్‌టీయూ ఎస్‌ఐ కేశవరావు కౌన్సిలింగ్ చేశారు. అక్టోబరు 2 గాంధీ జయంతి నుంచి 10వ తేదీ వరకు వీధి బాలలెవరైనా పనుల్లో ఉండి చదువుకోకపోతే అలాంటి వారిని గుర్తించి కౌన్సెలింగ్ చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఇచ్చిన షెడ్యూల్ మేరకు ఎస్పీ జీఆర్ రాధిక ఉత్తర్వులు ఇచ్చారని ఎస్‌ఐ అన్నారు. లేబర్, ఐసీడీఎస్, చైల్డ్‌లైన్, బచపన్ బచావ్, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులతో కలిసి ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ఎస్‌ఐ అన్నారు. కిమ్స్ సమీపంలో పనిలో ఉన్న మరో 18 ఏళ్లలోపు బాలుడిని గుర్తించి కౌన్సెలింగ్ చేసి సీడబ్ల్యూసీకి అప్పగించనున్నట్లు చెప్పారు.



చంటిపిల్లల తల్లులకు కౌన్సెలింగ్ చేస్తున్న ఏహెచ్‌టీయూ ఎస్‌ఐ కేశవరావు



శ్రీకాకుళం పీఎన్ కాలనీ: కొర్లాం గ్రామంలో చిట్టి చేతులతో గాంధీ విగ్రహానికి పూలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



శ్రీకాకుళం రూరల్: గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



కాశీబుగ్గ: గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

● మహాత్మా.. మనసాస్మరామి

నాయకులు, అధికారులు, సామాన్యులు మహాత్ముని మనసారా స్మరించుకున్నారు. ఆయన జయంతి సందర్భంగా గాంధీ చెప్పిన ఆదర్శాలను గుర్తుచేసుకున్నారు. పల్లెల్లో బాపూజీ వేషధారణలతో విద్యార్థులు వినూత్న నివాళులర్పించారు. గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా అంజలి ఘటించారు.



టెక్కలి కండ్రవీధిలో గాంధీ మందిరంలో పూజలు



కొత్తూరు: మెట్టూరు సెంటర్‌లో గాంధీ జయంతి సందర్భంగా వేషధారణలతో విద్యార్థుల ర్యాలీ

సెల్ దుకాణం..
వర్తకానికి కొత్త కోణం



తన పొలం వద్ద సేంద్రీయ ఎరువులు తయారు చేయిస్తున్న రైతు రావాడ మోహనరావు

- వినూత్నంగా కూరగాయల వ్యాపారం
- వాట్సాప్‌లో కూరగాయల ప్రదర్శన, విక్రయం
- బుక్ చేసిన వారికి డోర్ డెలివరీ
- దేశవానిపేట రైతు వినూత్న ప్రయత్నం





వాట్సాప్ గ్రూపులో పెట్టిన కూరగాయల ఫొటోలు

నరసన్నపేట: కూరగాయలు పండించడంలో పాత పద్ధతి పాటిస్తూ.. వాటిని విక్రయించడంలో మాత్రం కొత్త పోకడలు అవలంబిస్తున్నాడో రైతు. మార్కెట్‌కు వెళ్లే అవసరం లేకుండా, కూరగాయలు రాశిగా పోసి కొనుగోలు దారుల కోసం వేచి చూడాల్సిన అగత్యం లేకుండా సెల్‌ఫోన్ సాయంతో వ్యాపారం చేస్తున్నారు. ఇంటి నుంచే నిర్వహిస్తున్న ఈ వ్యాపారానికి రోజురోజుకీ డిమాండ్ పెరుగుతోంది. వాట్సాప్ సాయంతో ఓ గ్రూపును ఏర్పాటు చేసుకున్న రైతు దాని ద్వారానే ఎంచక్కా వ్యాపారం నిర్వహిస్తున్నారు. నచ్చిన కూరగాయలు వాట్సాప్ లో బుక్ చేసిన కొన్ని గంటల వ్యవధిలో డోర్ డెలివరీ చేస్తున్నారు. ఈ ప్రక్రియ తమకూ బాగుండడంతో వినియోగదారులు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నరసన్నపేటలోని దేశవానిపేటకు చెందిన ఆదర్శ రైతు రావాడ మోహనరావు వినూత్న పద్ధతిలో వర్తకం చేస్తున్నారు.

మోహనరావుకు ప్రకృతి వ్యవసాయంపై గురి బాగా కుదిరింది. దీంతో సారవకోట మండలంలోని పద్మపురంలో 20 ఎకరాల విస్తీర్ణంలో పురుగు మందులు వాడకుండా సహజ ఎరువులతో పంటలు పండిస్తున్నారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలతో కూరగాయల సాగు చేస్తున్నారు. వీటిని అందరిలా కాకుండా వాట్సాప్ ద్వారా విక్రయించాలని నిర్ణయించుకుని మన మార్ట్ ఆర్గానిక్ ఫార్మ్ అని పేరుతో ఒక గ్రూప్ క్రియేట్ చేసి తనకు తెలిసిన మిత్రులను చేర్చారు. మొదట్లో 26 మందితో ఉన్న ఈ గ్రూపు ఇప్పుడు 540 మందికి చేరింది. ఈ వాట్సాప్ గ్రూపులో పండిన కూరగాయలు, దుంపలు, పళ్లు వాటి ధరలను ప్రదర్శిస్తున్నారు. నచ్చిన వారు తమకు కావాల్సిన కూరగాయలను ఆర్డర్ పెడుతున్నారు. కొన్ని గంటల్లో కూరగాయలు ఇంటికి చేర్చుతున్నారు. ఇప్పుడు నరసన్నపేటలో ఈ వ్యాపారం హాట్ టాపిక్ అయింది. రోజూ ఆకుకూరలు, కూరగాయలు వంద కిలోలకు పైగా విక్రయిస్తున్నారు.

శ్రమ తప్పింది

నేను వృద్ధాప్యంలో ఉన్నాను. బజారుకు వెళ్లి కూరగాయలు కొనేందుకు నానా అవస్థలు పడేవాడిని. ఇప్పుడు కావాల్సిన కూరగాయలు వాట్సాప్‌లో ఆర్డర్ చేస్తున్నాం. తెచ్చి అందిస్తున్నారు. బాగుంది. కూరగాయలు నాణ్యతగా ఉంటున్నాయి.
– కేఎల్ఎస్ మూర్తి, పుండరీకాక్ష కాలని, నరసన్నపేట

తాజా కూరగాయలు

వాట్సాప్‌లో కూరగాయలు చూసి ఆర్డర్ పెడుతున్నాం. గంట వ్యవధిలోనే ఇంటికి తెచ్చి ఇస్తున్నారు. మాకు సమయం ఆదా అవుతోంది. కూరగాయలు కూడా తాజాగా ఉంటున్నాయి. తూకం కచ్చితంగా ఉంటుంది.
– సాయి శ్రీనివాస్, టీచర్, నరసన్నపేట

ఆదరించారు..



ప్రకృతి వ్యవసాయంపై మక్కువతో పలు ప్రాంతాల్లో తిరిగి ఏడాదిగా వివిధ పద్ధతుల్లో కూరగాయల సాగు చేస్తున్నాను. కొందరు మిత్రుల సలహాతో వాట్సాప్‌లో కూరగాయల వ్యాపారం మొదలుపెట్టాను. మూడు నెలలుగా ఇది నిరంతరాయంగా సాగుతోంది. పండుతున్న కూరగాయలు ఏ రోజుకు ఆ రోజు అయిపోతున్నాయి. వినియోగదారులు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
– రావాడ మోహనరావు, ఆదర్శ రైతు, దేశవానిపేట

4 నుంచి ధర్మప్రచార వారోత్సవాలు

అరసవల్లి: అరసవల్లి క్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ శాఖ, ధర్మప్రచార పరిషత్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు ధర్మప్రచార వారోత్సవాలను నిర్వహిస్తున్నామని, రాష్ట్ర మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆధ్వర్యంలో గోపూజతో ఈ ఉత్సవాలను ప్రారంభించనున్నారని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ప్రకటించారు. ఈ మేరకు పాలకమండలి సభ్యుల సమక్షంలో విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన షెడ్యూల్‌ను వెల్లడించారు. కార్యక్రమంలో పాలకమండలి ఎక్స్‌అఫీషియో మెంబర్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ఎస్.కోటేశ్వర చౌదరి, లుకలాపు గోవిందరావు, ద్వారపు అనూరాధ, జోగి మల్లెమ్మ, దుక్క గనిరాజు తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్ ఇదే..

4న ఉదయం గోపూజతో రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు ఉత్సవాలు ప్రారంభిస్తారు. 4 నుంచి 10 వరకు ప్రతి రోజూ ఉదయం 7 నుంచి 8 గంటల వరకు త్రిచ,సౌర,అరుణ ప్రయుక్త సూర్యనమస్కారాలు, 8 నుంచి 9 గంటల వరకు వేదపారాయణలు, 9 నుంచి 10 గంటల వరకు గోపూజ, 10 నుంచి 11 గంటల వరకు ఉపనిషత్ పారాయణాలు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు నాదస్వర కచేరి నిర్వహిస్తారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్, శంకరశర్మ, పాలకమండలి సభ్యులు

'కారాగారాలు కాదు ఆశ్రమాలు'



బహుమతులను అందజేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు

గార: జైళ్లను కారాగారాలుగా కాకుండా ఆశ్రమాలుగా భావించాలని సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసినాయుడు అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని అంపోలు జిల్లా జైలులో ఖైదీల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. మనుషుల ప్రవర్తనను నియంత్రించుకుకొని సన్మార్గంలో నడవడానికి మంచి అవకాశం కల్పించే వేదికలుగా ఆశ్రమాలు ఉంటాయన్నారు. క్షణికావేశంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం వల్ల కేసుల్లో ఇరుక్కుంటున్నారని అన్నారు. దీని వల్ల కుటుంబ సభ్యులకు మానసిక వేదన కలుగుతుందన్నారు. ఖైదీల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ నబీఖాన్, డిప్యూటీ జైలర్ దివాకర్‌నాయుడు, డాక్టర్ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

● నువ్వు దేవుడివయ్యా



సీఎం చిత్రపటానికి మనసారా దండం పెడుతున్న ఈ వృద్ధుడి పేరు పట్టికుల్ల వాసు. పింఛన్ తీసుకున్న ఆనందంలో దారిలో సీఎం ఫ్లెక్సీ కనిపిస్తే ఇలా కృతజ్ఞతగా నమస్కారం పెడుతున్నారు. మెళియాపుట్టి మండలం గంగరాజపురం పంచాయతీ పెద్ద జగన్నాథపురంలో ఈ దృశ్యం కనిపించింది. అటుగా వెళ్తున్న యువకులు కొందరు 'ఏం చేస్తున్నావు పెద్దయ్యా' అని అడిగితే పింఛన్ ఇవ్వడంతో పాటు ఒంట్లో బాగోకపోతే మంచి వైద్యుడితో వైద్యం చేయించారని, సొంత కొడుకులా ఆదుకున్నారని ఆయన చెప్పారు. - ఎల్ ఎన్‌పేట

విద్యుత్ భద్రతపై అవగాహన

అరసవల్లి: విద్యుత్ ఆదాతో పాటు భద్రతపై కూడా వినియోగదారులు మరింత అవగాహన పెంచుకోవాలని విద్యుత్ శాఖ ఆపరేషన్స్ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు పిలుపునిచ్చారు. సోమవారం విద్యుత్ భద్రతపై అవగాహన కల్పిస్తూ నగరంలో డీ–2 కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు విద్యుత్ ఇంజినీరింగ్ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇకమీదట ప్రతి నెలా 2వ తేదీన ఇలాంటి భద్రత అవగాహన ర్యాలీని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇది కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ బగ్గు రాంబాబు, డి2, డి2 ఏఈలు జె.సురేష్‌కుమార్, కమల్‌హాసన్, లైన్ ఇన్‌స్పెక్టర్లు పాపారావు, నారాయణరావు, కాంట్రాక్టర్ ఉంగటి పాపారావు తదితరులు పాల్గొన్నారు.



నగరంలో భద్రతా అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్న విద్యుత్ సిబ్బంది

జిల్లాలో ఎన్ఐఏ సోదాలు

శ్రీకాకుళం క్రైమ్/ పలాస/ వజ్రపుకొత్తూరు రూరల్: జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) జిల్లాలో సోమవారం ఉదయం పలువురి ఇళ్లలో సోదాలు నిర్వహించింది. మావోయిస్టులతో సంబంధాలు, వారి కార్యకలాపాల్లో పాలుపంచుకోవడం, యువత చేరేలా ప్రేరేపించడం తదితర అంశాల్లో భాగంగా పలువురు దళిత, మానవహక్కుల, ప్రజా సంఘాల నేతలు, మావోయిస్టుల సానుభూతిపరుల ఇళ్లల్లో ఉదయం 5:30 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటలవరకు దర్యాప్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ సోదాలు జరగడంతో కలకలం రేగింది. ఈ తనిఖీల్లో పలువురి ఇళ్లలో విప్లవ సాహిత్యం, భారత్ బచావో కర పత్రాలు, మొబైల్ ఫోన్లు, సిమ్‌కార్డులు, డైరీలు, బ్యాంకు పుస్తకాలు, పెన్‌డ్రైవ్‌లు, మావోయిస్టు నేత ఆర్కే పుస్తకాలు తదితరవి స్వాధీనం చేసుకున్నారు.

శ్రీకాకుళం ముచ్చువానిపేటలో నివసిస్తున్న కుల నిర్మూలన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్కా కృష్ణయ్య, బొందిలీపురంలో నివసిస్తున్న అడ్వకేట్, ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిలారి ఈశ్వరరావుల ఇళ్లలో సోదాలు చేసి ఈ నెల 27, 26 తేదీల్లో హైదరాబాద్ రావాలని నోటీసులు ఇచ్చారు. అలాగే టెక్కలి మునసబుపేటకు చెందిన కుల నిర్మూలన సమితి జిల్లా అధ్యక్షులు బెలమర ప్రభాకరరావు, పలాస మండలం మాకన్నపల్లిలో పౌరహక్కుల నేత సాలిన వీరాస్వామి ఇంటిలో సోదాలు నిర్వహించి ఆయనను ఈ నెల 25న హైదరాబాద్ రావాలని నోటీసులు ఇచ్చారు.

వీరితో పాటు పలాస మండలం మాకన్నపల్లికి చెందిన సాలిన ఈశ్వరరావు, వజ్రపుకొత్తూరు మండలం చీపురుపల్లి పంచాయతీ ఎం.గడూరుకు చెందిన అమరవీరుల బంధుమిత్ర సంఘ రాష్ట్ర కమిటీ సభ్యులు జోగి కోదండరావు, అక్కుపల్లి గ్రామానికి చెందిన మడ్డు ధనలక్ష్మి ఇళ్లల్లో సోదాలు జరిపారు. అయితే వీరికి ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు.

ఈ తనిఖీలపై రాష్ట్ర కుల నిర్మూలన సమితి ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య మాట్లాడుతూ మావోయిస్టులతో ఉన్న సంబంధాలపై తనను ప్రశ్నించారని, సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ప్రస్తుతం జగదల్‌పూర్ జైలులో ఉన్న దుడ్డు ప్రభాకరరావు ఇచ్చిన సమాచారం మేరకు ఇక్కడ పలువురి ఇళ్లలో సోదా లు చేస్తున్నామని వారు చెప్పారని తెలిపారు. కమ్యూనిజం భావజాలం నిండిన భారత్ బచావో సంస్థలో ఎందుకు యాక్టివ్‌గా తిరుగుతున్నారని ఆరా తీశారని వివరించారు. బీజేపీ వ్యతిరేక వర్గాన్ని వేధిస్తున్నారని ఆరోపించారు. సాలిన వీరాస్వామి మాట్లాడుతూ ఈ సోదాలను ఖండించాలని, మావోయిస్టులతో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. అమరవీరుల బంధుమిత్ర సంఘ రాష్ట్ర కమిటీ సభ్యులు జోగి కోదండరావు, అక్కుపల్లి గ్రామానికి చెందిన మడ్డు ధనలక్ష్మి మాట్లాడుతూ మోదీ వచ్చిన తర్వాత ఇలాంటి తనిఖీలు ఎక్కువ అయ్యాయని, తాము అమరవీరుల బంధుమిత్రుల సంఘంలో పని చేస్తు ప్రజా జీవితం గడుపుతున్నామని తెలిపారు. తన భర్త మడ్డు ధనరాజు బూటకపు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారని, ఆయన మృతదేహాన్ని చివరిసారిగా చూడలేకపోయానని ధనలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు.



వీరాస్వామి ఇంటిలో సోదాలు చేస్తున్న ఎన్ఐఏ అధికారులు



బొందిలీపురంలో ఎన్ఐఏ బృందం సోదాలు

క్లుప్తంగా

ఆదిత్యునిపై భక్తి గీతాలాపన



అనివేటి మండపంలో గీతాలు ఆలపిస్తున్న శ్రీలలిత

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని ప్రముఖ గాయని భమిడిపాటి శ్రీలలిత సోమవారం దర్శించుకున్నారు. అనంతరం అనివేటి మండపంలో పలు గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, పాలక మండలి మాజీ సభ్యురాలు యామిజాల గాయత్రి తదితరులు ఉన్నారు.

అక్కుపల్లి ప్రిన్సిపాల్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు



సన్మానం పొందుతున్న పాపారావు

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ముంజేటి పాపారావును రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకునిగా వీఎస్ఆర్ ఫౌండేషన్ (గుంటూరు) వారు గుర్తించారు. గాంధీ జయంతి సందర్భంగా సోమవారం గుంటూరులో గల రెవెన్యూ భవన్‌లో ఘనంగా సన్మానించి జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 మందిని ఎంపిక చేయగా శ్రీకాకుళం జిల్లా నుంచి పాపారావు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయనను బీసీ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ మోహన్ ఆధ్వర్యంలో సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు

టెక్కలి రూరల్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలి కోదండరామ వీధికి చెందిన యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కోదండరామ వీధికి చెందిన మట్ట ధనుంజయ్ అనే యువకుడు తన ద్విచక్రవాహనంపై ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఓ హోటల్‌లో ఫుడ్ పార్సిల్ చేసుకుని బైక్‌పై వెళ్తుండగా మరో బైక్‌ను ఢీకొట్టడంతో కిందకు పడిపోయాడు. యువకుడి తలకు తీవ్రగాయం కావడంతో ఆ యువకుడిని హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి రిమ్స్‌కు తీసుకెళ్లారు. ఘటనపై టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ



గాయపడిన షణ్ముఖరావును అంబులెన్స్‌లో తరలిస్తున్న ట్రాఫిక్ పోలీసుల

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని సోమవారం జీటీ రోడ్డు సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొట్టుకున్నాయని ట్రాఫిక్ ఎస్‌ఐ ఎస్ఎస్ దొర పేర్కొన్నారు. ఎస్‌ఐ, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. హిరమండలం గ్రామానికి చెందిన కిల్లాన షణ్ముఖరావు కుటుంబ సభ్యులతో కలిసి ఏడురోడ్ల కూడలిలో ఉన్న వీనస్ హోటల్‌కు వెళ్తుండగా మొగదాలపాడు గ్రామానికి చెందిన కొమర నరహరి అతి వేగంగా ద్విచక్రవాహనంపై ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో షణ్ముఖరావు కాలు విరిగిపోవడమే కాక చిన్న చిన్న గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని రిమ్స్‌కు తరలించారని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై అరిణాం అక్కివలస సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి, గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. మృతుడి వయసు 35–45 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా ఉంది. మృతుని వివరాల కోసం ప్రయత్నిస్తున్నట్లు ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹235	₹ 255

నేర్పుగా అలంకరణ..
ఓర్పుగా శిక్షణ



శిరోజాలు అందంగా తీర్చి దిద్దటంపై శిక్షణ

- బ్యూటీషియన్ కోర్సులకు తరగని ఆదరణ
- ఎచ్చెర్లలో ఉచితంగా శిక్షణ
- రెండు బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: ఒకప్పుడంటే మేకప్ వేసుకోవడానికి బ్యూటీపార్లర్ల వరకు వెళ్లాల్సి వచ్చేది. కానీ ఇప్పుడంత శ్రమ అవసరం లేదు. ఇంటికే బ్యూటిషియన్లు వచ్చి కావాల్సిన సేవలు అందించి వెళ్తున్నారు. ముఖ్యంగా వివాహాలు, ఇతర ఫంక్షన్ల సమయాల్లో వారం రోజుల నుంచి బ్యూటీషియన్లు పనిలోకి దిగిపోతున్నారు. దీంతో బ్యూటీషియన్ కోర్సులకు డిమాండ్ పెరిగింది. కొందరు డబ్బులు చెల్లించి శిక్షణ పొందుతుండగా, మరికొందరు ప్రభుత్వ సంస్థలు అందజేస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నారు. శిక్షణ తీసుకున్న మహిళల నైపుణ్యం బట్టి ఇంటి వద్ద నుంచే ఉపాధి పొందుతున్నారు. కనీసం రూ.10 వేల వరకు సైతం నెలకు స్థానికంగానే సంపాదిస్తున్నారు. మరికొందరకు మహిళలు స్థానికంగా ఉన్న అవసరం, డిమాండ్ బట్టి బ్యూటీ పార్లర్లు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు.

ఉచితంగా శిక్షణ..

ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ గ్రామీణ యువతకు పలు అంశాల్లో శిక్షణ ఇస్తోంది. ఇలా బ్యూటీషియన్ కోర్సు రెండు బ్యాచ్‌లు పూర్తిచేసింది. 30 రోజుల కోర్సులో బ్యాచ్‌కు 35 చొప్పున 70 మందికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ సంస్థ మహిళలు, పురుషులకు పలు అంశాల్లో శిక్షణ ఇస్తోంది.

మహిళలకు 30 రోజుల టైలరింగ్, 30 రోజుల బ్యూటీషియన్, 30 రోజుల మగ్గం వర్కు, 45 రోజుల డీటీపీ, 30 రోజు ల టాలీ, 13 రోజుల జూట్ వస్తువుల తయారీ, 10 రోజుల కొవ్వొత్తుల తయారీ, 10 రోజుల అగరబత్తీల తయారీ, పురుషులకు 45 రోజుల కంప్యూటర్ హార్డ్ వేర్, 30 రోజుల సెల్ ఫోన్ రిపేరింగ్, స ర్వీస్, 30 రోజుల కార్ డ్రైవింగ్, 30 రోజుల హౌస్ వైరింగ్, 30 రోజుల వీడియో, ఫోటోగ్రఫీ, 30 రోజు ల రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషనింగ్ మరమ్మతు లు, 30 రోజుల బైక్ మెకానిక్, 45 రోజుల డీటీపీ, 30 రోజుల ట్యాలీ శిక్షణ ఇస్తున్నారు. మహిళలు, పురుషులకు రొటేషన్ పద్ధతిలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తూ శిక్షణ ఇస్తున్నారు.

అన్ని అంశాలపై శిక్షణ

30 రోజుల బ్యూటీషియన్ కోర్సులో మహిళల అందానికి సంబంధించి అన్ని అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. వస్త్రధారణ, శిరోజాల రక్షణ, మోడల్స్, చర్మ సౌందర్యం, ఫేస్ ప్యాక్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. 10వ తరగతి అర్హత ఉంటే చాలు. ప్రధానంగా గ్రామీణ యువతులు బ్యూటీషియన్ కోర్సుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

స్వయం ఉపాధికి అవకాశం



ప్రధానంగా యువత స్వయం ఉపాధి సాధించేందుకు పలు వృత్తి విద్య అంశాల్లో శిక్షణ ఇస్తున్నాం. మహిళలు, పురుషులు శిక్షణ తీసుకున్నాక ఉన్న ప్రాంతంలో ఉపాధి పొందవచ్చు. మహిళలకు బ్యూటీషియన్, టైలరింగ్, మగ్గం వర్క్, జూట్ వస్తువులు, కొవ్వొత్తుల తయారీ, అగరబత్తీల తయారీ వంటి వాటిపై శిక్షణ ఇస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు అందానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో బ్యూటీషియన్ కోర్సుకు డిమాండ్ ఉంది.

– కల్లూరి శ్రీనివాసరావు, డైరెక్టర్, యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ

స్థానికంగా ఉపాధి



నాది రణస్థలం మండలం జీరుపాలేం గ్రామం. ఇంటర్మీడియెట్ చదువుకున్నాను. స్వయం ఉపాధి లక్ష్యంగా బ్యూటీషియన్ కోర్సులో చేరాను. మహిళల సౌందర్యానికి సంబంధించిన అన్ని అంశాలు తెలుసుకున్నాను. అవసరమైన సామగ్రి కొనుగోలు చేసి గ్రామంలోనే స్వయం ఉపాధి పొందుతున్నా. డిమాండ్ బట్టి నాకు ఆదాయం వస్తుంది.

– ఎం.విజయ, శిక్షణ పొందిన యువతి

మంచి అవకాశం



నాది ఎచ్చెర్ల గ్రామం. డిగ్రీ పూర్తి చేశాను. గ్రామాల్లో బ్యూటీషియన్ సేవలకు మహిళలు ప్రాధాన్యత నిస్తున్నారు. అందుకే ఈ శిక్షణలో చేరాను. స్వయం ఉపాధి లభిస్తుంది. ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంటుంది. భవిష్యత్‌లో అవకాశం ఉంటే బ్యూటీ పార్లర్ నిర్వహిస్తాను. మరో పక్క బ్యూటీ పార్లర్‌లో ఉద్యోగాలు సైతం చేయవచ్చు.

– ఎం.భారతి, శిక్షణ పొందిన యువతి.

18 మంది విద్యార్థులకు ఎక్స్‌లెన్స్ అవార్డులు



మాట్లాడుతున్న దానేటి శ్రీధర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): డాక్టర్ దానేటి శ్రీధర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం 18 మంది విద్యార్థులకు ఎక్స్‌లెన్స్ అవార్డులు అందించారు. డిగ్రీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ వృత్తి విద్యాకోర్సుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ. 4.60లక్షలు దానేటి శ్రీధర్ చేతులమీదుగా సోమవారం ఓ ప్రైవేటు హాస్పటల్ వద్ద అందించారు. పోలీస్ విభాగం నుంచి హోంగార్డుల పిల్లలకు ప్రత్యేకంగా అందించారు. ఈ సందర్భంగా దానేటి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులందరూ ఉన్నత స్థానాల్లోకి ఎదగాలని, అలాగే సమాజానికి ఉపయోగపడేలా పేరు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ తులసీరావు, మున్సిపల్ ఇంజినీర్ డీఈ సుగుణాకర్, జగన్, రమణమూర్తి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'నూతన విద్యావిధానంపై విస్తృత చర్చ'



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్

ఎచ్చెర్ల క్యాంపస్: నూతన విద్యావిధానం 2020పై విస్తృత చర్చ అవసరమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. వర్సిటీలో ఈ మేరకు 4,5 తేదీల్లో నూతన విద్యావిధానం అమలు, సవాళ్లు అంశంపై విద్యా విభాగం ఆధ్వర్యంలో జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు చెప్పారు. వర్సిటీ పరిపాలన కార్యాలయంలో సోమవారం వివరాలు వెల్లడించారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్, ఢిల్లీకి చెందిన ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సంస్థ, సమగ్ర శిక్ష సంస్థల ఆధ్వర్యంలో ఈ సెమినార్ నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రస్తుతం నూతన విద్యా విధానం అమలు నేపథ్యంలో 5+3+3+4 విధానంలో విద్య కొనసాగుతుందని చెప్పారు. ఎర్లీ ఎడ్యుకేషన్, స్కూల్ ఎడ్యుకేషన్, హయర్ ఎడ్యుకేషన్, ప్రొఫెషనల్ ఎడ్యుకేషన్, ఒకేషనల్ ఎడ్యుకేషన్, టెక్నికల్ ఎడ్యుకేషన్, స్పెషల్ ఎడ్యుకేషన్ అమలు జరుగుతుందని అన్నారు. ఈ మేరకు సెమినార్‌కు 100 పరిశోధన పత్రాలు వచ్చాయని, ఈ పత్రాలతో సావనీర్ విడుదల చేస్తామని అన్నారు. విద్యా విధానం బలోపేతం కావాలంటే అమలు, లోపాలు ఉంటే నియంత్రణ అవసరంగా చెప్పారు. సమావేశంలో సెమినార్ కన్వీనర్ డాక్టర్ హనుమంతు సుబ్రహ్మణ్యం, సహాయ కన్వీనర్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్ హాజరయ్యారు.

ఆర్మీ జవాన్‌కు ఘన స్వాగతం



ఆర్మీ జవాన్‌ను కుటుంబ సమేతంగా ఊరేగిస్తున్న గ్రామస్తులు

వజ్రపుకొత్తూరు: మండలం పెద్దమురహరిపురం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ గొరకల రామారావు భారత సైన్యంలో 24 ఏళ్లుగా సేవలు చేసి రెండు రోజుల కిందట రిటైరయ్యారు. ఆయన సోమవారం స్వగ్రామానికి రావడంతో సైనిక సేవా సమితి, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పూండి నుంచి స్వగ్రామం వరకు ఊరేగింపుగా సాదరస్వాగతం పలికారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు.

5న నూతన బ్యాచ్ ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్ శ్రీకాకుళంలో 14వ బ్యాచ్ ఈనెల 5వ తేదీన ప్రారంభమవుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు 13 బ్యాచ్‌లు పూర్తయ్యాయని, జిల్లాలో ఏకైక గవర్నమెంట్ డ్రైవింగ్ స్కూల్ ఏపీఎస్‌ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ అని పేర్కొన్నారు.

ఇప్పటివరకు ఇక్కడ అనేక మంది శిక్షణ తీసుకున్నారని, వారంతా వివిధ రంగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. ఇక్కడ డ్రైవింగ్ శిక్షణ అనంతరం ఆర్టీసీ వారు అందించే ఆ సర్టిఫికెట్‌తో బయట వివిధ శాఖలతో పాటు ఆర్టీసీలో కూడా ఆన్ కాల్ డ్రైవర్లుగా పని చేస్తున్నారని తెలిపారు. తదుపరి బ్యాచ్ వివరాల కోసం 9963091999, 7989723505 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

మర బోటు బోల్తా

- మత్స్యకారులు సురక్షితం



సురక్షితంగా బయటపడిన బాధిత మత్స్యకారులు

వజ్రపుకొత్తూరు రూరల్: డోకులపాడు సముద్ర తీరంలో ఆదివారం రాత్రి మర బోటు బోల్తా పడింది. అయితే మత్స్యకారులు సురక్షితంగా బయటపడ్డారు. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం.. మంచినీళ్లపేట గ్రామానికి చెందిన బోటు యజమాని బుంగ సవరయ్యతో పాటు మరి కొంత మంది మత్స్యకారులు చెక్క యర్రయ్య, సింహాద్రి, బుంగ ఈశ్వరరావు, మాణిక్యరావు, వలిశెట్టి సవరయ్యలు కలిసి అదే రోజు రాత్రి మర బోటుపై జోగా వలతో చేపల వేటకు వెళ్లారు. కొంత దూరం ప్రయాణం సాగించి డోకులపాడు తీరం వద్ద గల రాళ్ల సమీపంలో రాకాసి అల తాకిడికి బోటు బోల్తా పడింది. దీంతో మత్స్యకారులు చెల్లాచెదురుగా పడి హాహాకారాలు చేస్తూ ఈదుకుంటూ తీరానికి సురక్షితంగా చేరారు. అయితే ఈ ప్రమాదంతో బోటు మరమ్మతులకు గురి కాగా ఇంజిన్, వలలు సముద్ర అలలతో కొట్టుకుపోయాయి. ఈ మేరకు సోమవారం 50 మంది వరకు మత్స్యకారులు సంఘటన స్థలానికి చేరుకొని శ్రమించి బోట్‌ను మంచి నీటి తీరానికి చేర్చారు. అలాగే సముద్రంలో కొట్టుకుపోయిన ఇంజిన్, వలల కోసం గాలిస్తున్నారు. అయితే ఈ ప్రమాదంతో సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని కోరారు.

సాగునీటి ప్రవాహానికి అంతరాయం

- నారాయణపురం కుడికాలువలో సైఫన్ బావికి గండి
- గండిని పరిశీలించిన జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు



గండిని పరిశీలిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు, అధికారులు

సంతకవిటి: మండలంలోని చింతలపేట–షాలిపేట గ్రామాల మధ్య నారాయణపురం కుడికాలువ సైఫన్ బావికి ఆదివారం రాత్రి గండి పడింది. రెండు రోజుల పాటు ఆయకట్టుకు సాగునీటి సరఫరాకు అంతరాయం కలగనుంది. రంగారాయపురం గ్రామం వద్ద నారాయణపురం కుడికాలువ నీటి ప్రవాహానికి వీలుగా సైఫన్ ఏర్పాటుచేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు మందరాడ పెద్దచెరువు పార్లి పారుతోంది. వీటికి తోడు కాలువలో 6వేల క్యూసెక్కుల మేర నీటిని నారాయణపురం ఆనకట్ట అధికారులు విడుదల చేశారు. వరదనీటితో వచ్చిన గుర్రపుడెక్క, చెత్తాచెదారం బావిలో నీటి ప్రవాహానికి అడ్డగా ఉండిపోయింది. నీరు రెండోవైపు వెళ్లలేక బావి గోడలను తాకడంతో ఓ వైపు కూలిపోయింది.

కాలువ నుంచి వచ్చిన నీరంతా దిగువ ప్రాంతాలకు పోటెత్తింది. షాలిపేట, మందరాడ, మల్లయ్యపేట, రామారాయపురం తదితర గ్రామాల పరిధిలోని మూడువేల ఎకరాలను కాలువ నీరు ముంచెత్తింది. విషయం తెలుసుకున్న జెడ్పీ వైస్‌చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు నారాయణపురం ఆనకట్ట అధికారులకు సమాచారం అందించి, కాలువలో నీటి ప్రవాహాన్ని తగ్గించే చర్యలు చేపట్టారు. కాలువ రెగ్యులేటర్ తలుపులు పూర్తిగా మూయించారు. గండిపడిన ప్రాంతాన్ని సోమవారం ఉదయం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పంట పొలాలను పరిశీలించాలని వ్యవసాయశాఖ ఏఓ పైల నవీన్‌కు సూచించారు. ఆనకట్ట డీఈఈ మురళి, ఏఈ జీవీ రమణ, రవికుమార్ తదితరులు గండిని పరిశీలించారు. మండల పరిషత్ నుంచి మంజూరైన రూ.లక్షతో గోడ నిర్మాణ పనులు చేపడతామని చెప్పారు.

ఆగిన నీటి ప్రవాహం

గండి పడడంతో నారాయణపురం కుడికాలువ ద్వారా పొందూరు, ఎచ్చెర్ల మండలాలకు అందే సాగునీరు నిలిచిపోయింది. రెండురోజుల అనంతరం పనులు పూర్తికాగానే నీటిని కాలువలోకి మళ్లీ విడిచిపెడతామని అధికారులు తెలిపారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

టెక్కలి రూరల్: మండలంలోని నర్సింగపల్లి గ్రామానికి చెందిన పోలాకి మన్మధరావు (62) అనే వ్యక్తి సోమవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టెక్కలి ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. మన్మధరావు గత కొంత కాలంగా మద్యానికి బానిసైపోయాడు. దీంతో నిత్యం కుటుంబ సభ్యులతో తగాదా పడేవాడు. దానిలో భాగంగానే సోమవారం మద్యం తాగడంతో ఇంటిలో చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి తీవ్రంగా అస్వస్థతకు గురయ్యాడు. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బావిలో పడి యువకుడు మృతి



పతివాడ సింహాచలం

పొందూరు: మండలంలోని రాపాక గ్రామంలో ప్రమాదవశాత్తు బావిలో పడి పతివాడ సింహాచలం(22) అనే యువకుడు మృతి చెందినట్లు సోమవారం ఎస్‌ఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. మృతుడు వేకువజామున ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. గ్రామంలో వెతకగా కోనేటి చెరువు సమీపంలో గల బావి వద్ద చెప్పులు కనిపించాయి. దీంతో అనుమానం వచ్చి బావిలో వెతకడంతో మృతదేహం లభించింది. సింహాచలం స్థానికంగా ఉన్న స్టోన్ క్రషర్‌లో లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. అతడి తల్లి చిన్నమ్మడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహసారథి పాడె మోసిన సాయిరాజ్



గృహసారథి రమేష్ రౌతో పాడె మోస్తున్న సమన్వయకర్త పిరియా సాయిరాజు, హాజరైన అభిమానులు

ఇచ్ఛాపురం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా ఉంటూ, గృహ సారథిగా సేవలందిస్తున్న రమేష్ రౌతో ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని పార్టీ సమన్వయకర్త పిరియా సాయిరాజు అన్నారు. పలాస మండలం కోసంగిపురం ఫ్లై ఓవర్ వంతెనపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ గృహ సారథి రమేష్ రౌతో మృతి చెందాడు. డొంకూరులో సోమవారం సాయంత్రం జరిగిన రమేష్ అంతిమ యాత్రకు హాజరైన మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజు రమేష్ రౌతో పాడె మోశారు. మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు.

నాటుబండిపై నుంచి జారి పడి..



మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య, కుటుంబ సభ్యులు

లావేరు: నాటు బండిపై నుంచి జారి పడి మండలంలోని చినకొత్తకోట గ్రామానికి చెందిన యరబోతుల దుర్గారావు(56) అనే వ్యక్తి సోమవారం మృతి చెందారు. లావేరు స్టేషన్ ఎస్సీ రామారావు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చినకొత్తకోట గ్రామానికి చెందిన దుర్గారావు సోమవారం పాత కుంకాం గ్రామంలో రైస్ మిల్లుకు ధాన్యాన్ని నాటుబండితో తీసుకొని వెళ్లి అక్కడ మిల్లులో ధాన్యం ఆడించి తిరిగి వస్తుండగా.. ఉన్నట్టుండి బండిపై నుంచి జారి కింద పడిపోయారు. ఆయన తలపై నుంచి బండి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే లావేరు స్టేషన్ ఎస్‌ఐ ఎ.కోటీశ్వరరావు ప్రమాద స్థలానికి వెళ్లి ప్రమాదం వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మృతుడికి భార్య ఈశ్వరమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేశారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న వ్యక్తి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.